సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 10 । నవంబర్ । 2023



సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తాం

గిరిజనులు సమస్యలు తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు అన్నారు. 2లో



పీహెచ్‌సీలో తనిఖీలు

చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో గురువారం జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రకాశం తనిఖీలు నిర్వహించారు. 2లో



ఘనంగా తులసీదళార్చన

విశాఖ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం అమ్మవారికి సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉజ్వల యోజనలో ఉచిత గ్యాస్ కనెక్షన్

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా జిల్లాలోని అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లను పంపిణీ చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవోలు, పలు ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో కనీసం 100 గ్యాస్ కనెక్షన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. జీసీసీ,ఐటీడీఏ గ్యాస్ ఏజెన్సీలు సమావేశాలు నిర్వహించి గ్యాస్ కనెక్షన్లను దరఖాస్తులు సేకరించాలని సూచించారు. సచివాలయం,వెలుగు సిబ్బంది గ్రామాల్లో ఉచిత గ్యాస్ కనెక్షన్‌లకు అర్హులైన పేద కుటుంబాలను గుర్తించాలన్నారు.ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉచితమని ప్రజలకు తెలిసేలా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని ఆయన ఆదేశించారు. రేషన్‌కార్డు, కుటుంబంలో వయోజనుల ఆధార్ కార్డుల జెరాక్స్ కాపీలు, బ్యాంకు పాసు పుస్తకం జెరాక్స్‌లను దరఖాస్తులతో పాటు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఆయిల్ కంపెనీల ప్రతినిధుల టెక్నికల్ సపోర్టు తీసుకోవాలని సూచించారు.

హక్కుల పట్ల అవగాహన తప్పనిసరి

- ఎస్పీ తుహిన్ సిన్హా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు రూరల్ : వినియోగదారులు తమ యొక్క హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కల్పనకు ముద్రించిన కరపత్రాలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం ప్రతి వినియోగదారుడు తమయొక్క హక్కులు, బాధ్యతల కోసం తెలుసుకుని ఉండాలన్నారు. తూనికల, కొలతల మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాడంగి సూర్యకళ, ఉపాధ్యక్షుడు గడ్డంగి రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శి ఒలిబిరి బాలరాజు, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు తెడబారికి ముత్యాలమ్మ, మహిళ కార్యదర్శి రూడి రమణమ్మ, పెదబయలు మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కూడా కృష్ణబాబు, కోశాధికారి జి. అప్పారావు పాల్గొన్నారు.

రేపు శ్రీవారి సన్నిధిలో లడ్డూ విక్రయాలు

కొమ్మాది (విశాఖ): రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీన లడ్డూ విక్రయాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. 750 గ్రాములు ఉన్న కల్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు ఉన్న సాధారణ లడ్డూ రూ.20లకు విక్రయించనున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి శ్రీవారి సన్నిధిలోని లడ్డూ విక్రయాల కౌంటర్ వద్ద లభిస్తాయని పేర్కొన్నారు.

రబ్బరు తయారీ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి



రబ్బరు తయారీ యూనిట్లను పంపిణీ చేస్తున్న లలితకామేశ్వరి

రంపచోడవరం: కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న రబ్బరు ప్రాసెసింగ్ యూనిట్లను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డా. లలితకామేశ్వరి కోరారు. మండలంలోని లంకపాకలు, పీరుకొండ ,కాకవాడ, ఆనేంపల్లి గ్రామాల్లో రబ్బరు సాగు చేసే గిరిజన రైతులకు గురువారం తయారీ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు రబ్బరు తయారు షీట్లు తయారు చేసేందుకు సరైన యంత్రాలు లేకపోవడంతో యంత్రాలు అందజేశామన్నారు. రబ్బరు చెట్ల నుంచి పాలు సేకరణకు కిట్‌లు, సేకరించిన రబ్బరు పాలు ప్రాసెస్ చేసేందుకు అవసరమైన రసాయనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. చిరంజీవి, రబ్బరు ప్రాజెక్ట్ ఫీల్డ్ మ్యానేజర్ డి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం కరపత్రాలతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



హుకుంపేటలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కించాయిపుట్టులో మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

జగనన్నతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు

- ఆయనతోనే సంక్షేమం
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- చింతపల్లిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. పల్లె నిద్ర' నిర్వహణ
- అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన



చింతపల్లిలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి రూరల్: రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రం చింతపల్లిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. పల్లె నిద్ర' కార్యక్రమాలకు ఆమె శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఆమె వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి జగనన్న అత్యధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఇలా ఎన్నో సేవలు ప్రజలకు గ్రామస్థాయిలో అందుబాటులోకి తెచ్చారన్నారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడిందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరుకున్నారన్నారు. గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛను వంటి సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే చేరవేస్తోందన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నికల హామీలన్నింటిని అమలు చేసి ప్రజల సంతోషాన్ని కోరుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని ఆమె పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అమలు చేసి గిరిజనుల ఆదరాభిమానాలు పొందారన్నారు. అందువల్లనే రాష్ట్రానికి మళ్లీ జగనన్నను సీఎంను చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో కలసి స్థానిక గిరిజనులతో సహపంక్తి భోజనాలు చేశారు. గిరిజనులకు భరోసా కల్పించేందుకు గ్రామంలోనే రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీ వెంగళరావు, సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో ఆశాజ్యోతి , మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, బలపం సర్పంచ్ రమేష్, జిల్లా కార్యదర్శి గణబాబు, ఎంపీటీసీలు ధారలక్ష్మి, లోవరాజు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం జగనన్న లక్ష్యం

ముంచంగిపుట్టు: రాష్ట్రంలో ఇంటింటా సంక్షేమం అందించడం జగనన్న లక్ష్యం అని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. గురువారం మండలంలోని కించాయిపుట్టు గ్రామ సచివాలయంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆమె వివరించారు. జగనన్న ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, సుజనకోట ఎంపీటీసీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలో నెయ్యల వీధిలో వార్డు మెంబర్ బుజ్జి ఇంట్లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. అక్కడే బస చేశారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి

హుకుంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామసచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగన్ బ్రోచర్లను అందజేశారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పేదలతోపాటు అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలని అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రభుత్వం అందించిన పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. హుకుంపేట పంచాయతీలోనే రూ.11కోట్ల45 లక్షల 70వేల 292 సంక్షేమానికి ప్రభుత్వం వెచ్చించిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, జిల్లా సాంస్కృతికి విభాగం అధ్యక్షుడు జి.దిలీప్ కుమార్, పార్టీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ కొందలరావు, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, కాకరి బొంజుబాబు, సాంబ, పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ



చింతపల్లిలో రాత్రి బస చేసిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు



వాలీబాల్ పోటీలకు జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ



పోటీపడుతున్న పశ్చిమ గోదావరి-శ్రీకాకుళం బాలికల జట్లు

అరకులోయ టౌన్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం అరకులోయ కంతబొంషుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. వీటిని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు ప్రారంభించారు. క్రీడాకారులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. తొలిమ్యాచ్ పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం బాలికల జట్ల మధ్య ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 26 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో 13 చొప్పున బాలురు, బాలికలు జట్లకు చెందిన 312 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈనెల 11 వరకు జరగనున్నాయి.

జాతీయస్థాయికి ఎదగాలి: ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు కోరారు. గురువారం మండలంలోని కంతబొంషుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ప్రారంభమైన అండర్ -14 వాలీబాల్ పోటీలను ఆయన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడలతోనే మంచి క్రమశిక్షణ సాధ్యమన్నారు. క్రీడాకారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పాల్గుణ క్రీడా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈపోటీలను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన 70 మంది పీడీలు, పీఈటీలు పోటీలు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎస్. చెల్లయ్య, డీడీ కొండలరావు, అల్లూరి జిల్లా స్కూల్స్ గేమ్స్ సెక్రటరీ సూరిబాబు, అసిస్టెంట్ సెక్రటరీ సద్దు, పీటీ, పీఈటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి యం. భూపతిరాజు, కోర్టు ఇన్‌చార్జీ కె. అప్పలరాజు, హెచ్‌ఎంలు ధయానిధి, పీఎస్‌ఎన్ మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంతో రోగుల ప్రాణాలు కాపాడండి

కలెక్టర్ సుమిత్‌కుమార్



రక్తదానం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లతో కలెక్టర్ సుమిత్‌కుమార్,ఇతర అధికారులు



రక్తదాతలకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: రక్తదానం చేసి అత్యవసర పరిస్థితులలో రోగుల ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. గురువారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సంయుక్తంగా గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాడేరు డివిజన్‌లోని ఎనిమిది మండలాల రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు 35 మంది, సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్‌కు చెందిన 20 మంది జవాన్లు,పాడేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన 15మంది రక్తదానం చేశారు. వీరిని కలెక్టర్ అభినందించారు. ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆరోగ్యవంతులంతా ప్రతి మూడు నెలలకు ఓ సారి రక్తదానం చేయాలని, దీనివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవన్నారు. గిరిజన ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అవసరాలు అధికంగా ఉందన్నారు. జిల్లాలో ఎక్కడ రక్తదాన శిబిరాలు జరిగినా అన్ని వర్గాల ప్రజలు శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీవో నవీన్, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చిన్నికృష్ణ, వి.త్రినాథరావునాయుడు, ఉపాధ్యక్షుడు కె.అప్పలస్వామి, ఇతర ప్రతినిధులు ప్రశాంత్‌కుమార్, చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ సొసైటీ పాడేరు శాఖ ప్రతినిధులు డాక్టర్ జి.రూపకళ, కె.సింహాచలం, వి.లోహితాస్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

'భవన నిర్మాణాలు నిలిపివేయండి'

సాక్షి,పాడేరు: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలోని ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణాలు నిలిపివేయాలని డిపో మేనేజర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఖాళీ స్థలాలను 15ఏళ్ల లీజుపై టెండర్‌దారులైన ఎస్టీలకు కేటాయించడం జరిగిందన్నారు. స్థలాల కేటాయింపులపై పలువురు హైకోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టులో విచారణ పూర్తయి తదుపరి హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకు భవన నిర్మాణాలు నిలిపివేయాలని, ఆయా స్థలాల్లో వ్యాపారాలు కూడా నిర్వహించవద్దని తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయన్నారు. టెండర్‌దారులు వెంటనే భవన నిర్మాణాలు నిలిపివేయాలని ఆయన సూచించారు.

అడ్డతీగలో గిరిజనుడి హత్య!

- గుర్తు తెలియని వ్యక్తుల దాడి
- మృతుడు అనంతగిరి మండలం గుమ్మ గ్రామ వాసి



అర్జున్ మృతదేహం

శృంగవరపుకోట (విజయనగరం జిల్లా): మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ అడ్డతీగ గ్రామం వద్ద గురువారం సాయంత్రం గిరిజన యువకుడు హత్యకు గురైనట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై స్థానిక పోలీసులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. మృతుని భార్య ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి మండలం గుమ్మ గ్రామానికి చెందిన పాంగి అర్జున్(38) మండలంలోని కొత్తఅడ్డతీగ గ్రామంలో భార్యాబిడ్డలతో నివసిస్తున్నాడు. గత కొంత కాలంగా గ్రామానికి దగ్గరలో ఉన్న అనాథాశ్రమంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6గంటల సమయంలో గ్రామానికి సమీపంలో అర్జున్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో గుండెలపై రెండుచోట్ల లోతైన గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తొలుత గుర్తించి అర్జున్ భార్య కాంతానికి సమాచారం ఇచ్చాడు. ఆమె పరుగున వెళ్లి భర్తతో మాట్లాడగా అడ్డతీగ వాళ్లు కొట్టారని చెబుతుండగా ఆయన మాట ఆగిపోయింది. భార్య వెంటనే గ్రామంలోకి వచ్చి చెప్పగా 108లో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అర్జున్ మృతి చెందినట్టు వైద్యులు చెప్పడంతో భార్య కన్నీరుమున్నీరవుతోంది. అర్జున్‌కు భార్య ఐదు నెలలు గర్భిణి కాగా, ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. అర్జున్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాల పంపిణీ



గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి



ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డును పరిశీలిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి

గంగవరం : రాష్ట్రంలో పాఠశాలలో పాఠ్యపుస్తకాల కొరత లేదని, అన్ని పాఠశాలలకు పూర్తి స్థాయిలో సరఫరా చేశామని ప్రభుత్వ పాఠ్య పుస్తక ముద్రణాలయం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం రంపచోడవరం ఏజెన్సీ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు తరగతులను ఆయన పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు.ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని అడిగారు. టీచింగ్ ప్లాన్, లెసన్‌ప్లాన్ గుర్తించి ఆరా తీశారు. వర్క్ బుక్స్, ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని హెచ్‌ఎం ఝాన్సీహేన్సన్‌కు సూచించారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు వినియోగంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతికి పాఠ్య పుస్తకాలు కొత్తవి పంపిణీ చేస్తామన్నారు. ప్రతి పాఠ్యపుస్తకంలో తెలుగుతో పాటు రెండో లాంగ్వేజ్‌గా ఆంగ్లం భాషలతో పాఠ్యాంశాలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతీ పాఠశాలలను నాడు-నేడు పథకంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, రంపచోడవరం, గంగవరం మండల విద్యాశాఖాధికారులు సత్యనారాయణ, టి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

రాష్ట్ర కుటుంబ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్ జనార్దన్



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న జనార్దన్

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో మాతా శిశు మరణాలు నివారణే లక్ష్యంగా వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని రాష్ట్ర కుటుంబ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్ గంపరాయి జనార్దన్ ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక సీహెచ్‌సి, కిలగాడ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాలపై వైద్యాధికారుల నుంచి తెలుసుకున్నారు. మారుమూల గ్రామాల్లో గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు చేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యాధికారులు మౌనిక, ధరణి, రమేష్, శిరీష పాల్గొన్నారు.

పెదబయలు: కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచాలని రాష్ట్ర కుటుంబ నియంత్రణ విభాగం జాయింట్ డైరెక్టర్ గంపరాయి జనార్దన్ సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ముగ్గురు పిల్లల తరువాత కుటుంబ నియంత్రణ చేసుకోవడం మంచిదన్న విషయాన్ని అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎక్కువ మంది పిల్లలను కనడం వల్ల తల్లికి ఆరోగ్య సమస్యలు పెరుగుతాయన్నారు. వివాహమైన తరువాత కొంతకాలం పిల్లలు కనకుండా ఉండేందుకు పీహెచ్‌సీల్లో గర్భనిరోధక ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ముగ్గురు పిల్లల తరువాత పిల్లలు వద్దనుకుంటే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు స్త్రీ, పురుషులు చేసుకోవాలని సూచించారు. ముంచంగిపుట్టు, కిలగాడ, లబ్బూరు పీహెచ్‌సీల వైద్యాధికారులకు ట్యూబెక్టమీ ఆపరేషన్లకు శిక్షణ ఇచ్చామన్నారు. త్వరలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఆస్పత్రి వైద్యుల సమన్వయంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సింధూరం పడాల్ పాల్గొన్నారు.



వణుకుతున్న మన్యం

జిల్లాలో మినుములూరులో 15, అరకులో 15.4, చింతపల్లిలో 17.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. చలితీవ్రత ఎక్కువగా ఉంది.

– సాక్షి పాడేరు

క్లుప్తంగా

పీహెచ్‌సీలో తనిఖీలు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో గురువారం జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రకాశం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాలు, మలేరియా, తదితర జ్వరాల కేసుల నమోదుపై ఆరా తీశారు. మందుల నిల్వలను తనిఖీ చేశారు. అసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. గర్భిణుల స్కానింగ్‌లను పరిశీలించారు. ఆస్పత్రిలో అవసరమైన సౌకర్యాలను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించే విధానంపై సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయటౌన్: అరకులోయ, అనంతగిరి, బొర్రాలో పనిచేస్తున్న టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అరకులోయ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పాడేరులో టూరిజం కార్మికులు, అధికారులు, కలెక్టర్‌తో జరిగిన చర్చలో సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారన్నారు. సమస్యల పరిష్కారంపై టూరిజం ఎండీతో చర్చించానన్నారు. అయితే కార్మికులు సమ్మె చేయకుండా సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

బాలికకు గాయాలు


ఆస్పత్రిలో బాలికకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: హాస్టల్‌లో గురువారం సాయంత్రం విద్యార్థినులు భోజనం కోసం లైనులో ఉన్నారు. ఈ క్రమంలో పిల్లల మధ్య జరిగిన తోపులాటలో బాలిక అమృత ధార వర్షిని, సాంబారు గిన్నెలో పడిపోయింది. హుటాహుటిన సిబ్బంది ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ వైద్య సేవలు అందించారు.

ఇది కదా అభిమానమంటే...
ఇది కదా సంక్షేమ పాలనంటే..
ఇది కదా.. అభివృద్ధి అంటే..

అనకాపల్లిలో సామాజిక సాధికార బస్సు యాత్రలో ప్రజాదరణ చూస్తుంటే.. ఊరూవాడా కదిలొచ్చిందా.. జన ప్రవాహమై పరవళ్లు తొక్కిందా.. అన్నట్టుగా జనం బ్రహ్మరథం పట్టారు. జననేత జగన్ జనంలోకి వచ్చినంత సంబ్రమంగా... ఆయన పంపిన దూతలకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ 53 నెలల సంక్షేమ పాలనకు జేజేలు పలికారు.



అనకాపల్లి సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం

అనకాపల్లి అదరహో

- జన సునామీలా ఎన్టీఆర్ స్టేడియం
- దద్దరిల్లిన అనకాపల్లి సామాజిక సాధికార సభ
- ఉత్తరాంధ్రలో తొలి విడత యాత్రకు ఘన ముగింపు
- వేలాది బైక్‌లు, వందలాది ఆటోలు, కార్లతో ర్యాలీ
- మారేడుపూడి వద్ద ప్రారంభమై తేడాడలో ముగిసిన యాత్ర
- పలు నూతన భవనాలు ప్రారంభోత్సవం

సాక్షి, అనకాపల్లి: పట్టణంలో ఎటు చూసినా జన సందోహమే.. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.. దార్లన్నీ ఎన్టీఆర్ స్టేడియం వైపే చూపించాయి. ఇక్కడ మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ జన సంద్రాన్ని తలపించింది. ఈ సందర్భంగా సభలో పలువురు వైఎస్సార్‌సీపీ మంత్రులు, నేతలు ప్రసంగించారు. అంతకుముందు అశేష జనవాహినిలో సాగిన తొలి విడత సామాజిక సాధికార బస్సు యాత్ర ఘనంగా ముగిసింది. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో మారేడుపూడిలో గురువారం ఉదయం 11.30 గంటలకు సామాజిక సాధికార బస్సుయాత్రను వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మంచిని వివరించడానికిగాను చేపట్టిన ఈ బస్సు యాత్రలో నియోజకవర్గంలో అనకాపల్లి రూరల్, కశింకోట మండలాల నుంచి వేలాది మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వేలాది బైక్‌లు, ఆటోలు, వందలాది కార్లతో ర్యాలీగా సాగింది. ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఆ సమయంలో మహిళల కోలాటాలతోపాటు జై జగన్.. జై గుడివాడ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. మారేడుపూడి నుంచి జాతీయ రహదారి మీదుగా బస్సు యాత్ర కశింకోట మండలం బయ్యవరం, తేగాడ చేరుకుంది. ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లలో పార్టీ శ్రేణులు టపాసులతో, మందుగుండు పేలుళ్లతో స్వాగతం పలుకుతూ సందడి చేశాయి. ముందుగా మారేడుపూడికి చేరుకున్న వైవీ సుబ్బారెడ్డికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలను అందించి ఘన స్వాగతం పలికారు. తేగాడలో జగనన్న కాలనీని, నూతన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుతో కలిసి ప్రారంభించారు.

పూడిమడక జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళి

అనకాపల్లి పూడిమడక జంక్షన్‌లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, ధర్మాన ప్రసాదరావు, ఎంపీ బీవీ సత్యవతి, జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బహిరంగ సభకు హాజరయ్యారు.


సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, వేదికపై డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్యే గణేష్ తదితరులు


సభా ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ధర్మాన తదితరులు


హోరెత్తిన బైక్ ర్యాలీ

గర్భిణులకు వైద్య పరీక్షలు


చవిటిదిబ్బలులో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రంపచోడవరం: ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎస్ఎంఏ) లో భాగంగా గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సుమారు 62 మంది గర్భిణులకు వివిధ రకాల వైద్య సేవలు అందించినట్టు చెప్పారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఎటువంటి సమస్యలు లేకుండా పుడతారన్నారు.

రెండు రోజుల పాటు క్యాంపు జరుగుతుందన్నారు. గర్భిణులు పాటించవలసిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణీలకు స్కానింగ్, బ్లడ్‌టెస్ట్‌లు చేసి మందులు అందజేశారు. ఆసుపత్రి కౌన్సిలర్ వాసు, పర్సనల్ హుస్సేన్ పలు అంశాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు.

వై.రామవరం: పి యమ్ ఎస్ ఎమ్ ఏ కార్యక్రమంలో బాగంగా మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు డాక్టర్ దినేష్, నరేంద్రల ఆధ్వర్యంలో 82 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. హైరిస్క్ ఉన్న నలుగురు గర్భిణులను పీహెచ్‌సీలో చేర్పించారు. శిబిరానికి వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, అప్పలరాజుపేట ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ కోత విధిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ.శ్రీనివాసరావు తెలిపారు. ట్రీ కటింగ్, మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెరుగైన విద్య అందించాలి


పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న విద్యాశాఖాధికారులు

గంగవరం : రంపచోడవరం ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వర రావు, ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావులు స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమబాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠ్యాంశాల బోధన, వర్క్ బుక్స్ వినియోగాన్ని పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, మెరుగైన విద్య అందించాలన్నారు. హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చిన్నబ్బాయి (ఫైల్)

రాజవొమ్మంగి: మేకలను మేతకు తీసుకొని వెళ్లిన కాపరి, అనుకోని రీతిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామానికి చెందిన జర్తా చిన్నబ్బాయి (23) కాకినాడ జీజీహెచ్‌సీలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 27న చిన్నబ్బాయి మేకలను సమీప కొండకు మేతకు తీసుకొని వెళ్లాడు. మేకలు దారి తప్పి కనుపించకుండా పోయాయి. చాలా సేపు వాటికోసం వెతికినా కనుపించలేదు. దీంతో ఇంటి వద్ద కుటుంబ సభ్యులు మందలిస్తారని భయపడి పొలాలకు ఉపయోగించే గడ్డిమందు సేవించాడు. కుటుంబసభ్యులు అతనికి ఏలేశ్వరం సీహెచ్‌సీకు తరలించి వైద్యసహాయం అందజేశారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు అదే రోజు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కాగా గత 13 రోజులుగా చికిత్స పొందుతున్న చిన్నబ్బాయి పరిస్థితి విషమించి చివరికి మృతి చెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

ఏఎస్పీ జగదీష్


కిండంగి గ్రామస్తులతో ఏఎస్పీ జగదీష్

రాజవొమ్మంగి: ఆదివాసీలకు అండగా ఉంటామని ఏఎస్పీ జగదీష్ అడహళి చెప్పారు. మండలంలోని లోదొడ్డి పంచాయతి పరిధిలోని ఎత్తైన కొండపై ఉన్న కిండంగి గ్రామాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఆదివాసీల యోగక్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు నిత్యావసర సరకులు, పాదరక్షాలు, యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. గ్రామానికి విద్యుత్, రహదారి సదుపాయం, అంగన్‌వాడి కేంద్రం కోసం స్థానికులు ఏఎస్పీను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం లోదొడ్డి ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థులు విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. లోదొడ్డి, వాతంగి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. సర్పంచ్ రామారావు, సీఐ బాజిలాల్, జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు, స్పెషల్‌బ్రాంచ్ హెచ్‌సీ దుర్గారావు, సాయుధ స్పెషల్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

దేవీపట్నం : గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దేవీపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దేవీపట్నం ఎస్‌ఐ కె.వి నాగార్జున, తెలిపిన వివరాల ప్రకారం మాతృశ్రీ గండి పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద బుధవారం సాయంత్రం సమయంలో అందరూ చూస్తుండగా గోదావరి నదిలోకి నడుచుకుంటూ వెళ్లి గోదావరిలో మునిగిపోయాడు .వెంటనే పలువురు స్పందించి గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ కనపడలేదు. గురువారం మధ్యాహ్నం గండి పోచమ్మ ఆలయం వద్ద మృతదేహం లభ్యం కాగా మృతుడు రాజమహేంద్రవరం దానవాయిపేటలో చెరుకురసం విక్రయించే వ్యక్తిగా పోలీసుల గుర్తించినట్టు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తాం


గిరిజన మ్యూజియం వద్ద ప్రతిమలు తిలకిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్


కాఫీ మ్యూజియంలో ఎమ్మెల్యేతో కలిసి కాఫీ తాగుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

అరకులోయ టౌన్: గిరిజనులకు అండగా ఉంటామని, సమస్యలు నేరుగా లేదా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు అన్నారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన గిరిజన, కాఫీ మ్యూజియంలను సందర్శించారు. కొత్తభల్లుగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయనకు విద్యార్థినులను ఆయనకు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠ్యంశాన్ని బోధించారు. విద్యార్థులు ఆంగ్ల పదాలు చదవడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, సచివాలయంలో సర్పంచ్ రాధిక, చైర్మన్, ఎమ్మెల్యేలను సత్కరించారు. కొత్త భల్లుగుడ గ్రామ సచివాలయంలో గిరిజనులతో ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు మాట్లాడారు. పీవీటీజీలకు అండగా ఉంటుందన్నారు. సచివాలయాల ద్వారా లేదా తమకు నేరుగా సమస్యలు తెలియజేసినా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పిల్లలను బాధ్యతగా చదివించి, బాలికలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లెందుకు తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఒక్కటే ఉండేదని, దీంతో ఎస్టీల సమస్యలు పట్టించుకునే దాఖలాలు ఉండేవి కాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయడంతో గిరిజనుల సమస్యలు గుర్తించేందుకు వీలు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ సుస్మిత, ఎంపీటీసీలు ఆనంద్‌కుమార్, లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవో వెంకటేష్, పాల్గొన్నారు. ఎస్‌ఐ కుమార్ భారీ బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు


పార్టీలోకి చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న దృశ్యం

వీఆర్ పురం: రేఖపల్లి గొల్లగుడెం 9 వార్డు మెంబర్ సోలా కృష్ణవేణి భర్త సోలా వినోద్ (సీపీఎం నాయకులు) వైఎస్సార్‌సీపీలో చేరారు. గొల్లగూడెంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మోడెం నరేష్ ఆధ్వర్యంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ప్రతీ కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీకి ఉన్న ప్రజాదరణ దేశంలో ఇతర ఏ పార్టీకీ లేదన్నారు. అనంతరం పార్టీలో చేరిన మూడు కుటుంబాలకు చెందిన మేకల మాధవరావు,సోలా జయమ్మ,బొర్రా శ్రీనివాస్ కుటుంబాలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, రాష్ట్ర నాయకుడు ముత్యాల శ్రీనివాస్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మోనిటరింగ్ కమిషన్ సభ్యుడు చిక్కాల బాలు, చింతూరు వైస్ ఎంపీపీ చిన్ని , ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి , సర్పంచ్ రామారావు, నాయకులు వెంగళరావు, కాంతారావు, ఉమా, బాలరాజు, జయరాజ్, నాగేశ్వరరావు ముత్యాలరావు,మోడెం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

24 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు


పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్

పాడేరు రూరల్ : మండలంలోని కందమామిడి జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానస్పదంగా ఉన్న ఓ స్కూటీను తనిఖీ చేశారు. వాహనంలో రెండు బాక్సుల్లో 12 మూటల్లో నింపి ఉన్న 24కిలోల గంజాయి లభ్యమైనట్టు ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్ చెప్పారు. ఒడిశా నుంచి కొనుగోలు చేసి వి.మాడుగుల తరలిస్తున్నట్టు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని స్కూటీతో పాటు మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశామన్నారు. గంజాయి తరలిస్తున్న పాడేరు మండలం ఉగ్గంగొయ్యి గ్రామానికి చెందిన కిల్లో గణేష్, పోతురాజుమెట్ట గ్రామానికి చెందిన వంతాల సూరిబాబులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ఇతర ముద్దాయిలను కూడా త్వరలోనే పట్టుకుని అరెస్ట్ చేస్తామని ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్ తెలిపారు.